RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 249 | మంగళవారం, ఫిబ్రవరి 17 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

# గందరగోళంగా మున్సిపల్ చైర్మన్ల ఎంపిక

మెజార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు హస్తగతం

ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగా

హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం

ఎక్స్ అఫీషియో సభ్యలల బలంతో కాంగ్రెస్ పైచేయి

ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్

కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటన

కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి

కోరం లేక 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా



**హైదరాబాద్,ఫిబ్రవరి16 :** తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్లు, వైఎస్ ఛైర్మన్ల ఎన్నికలో తీవ్ర గందరగోళం నడిచింది. పలుచోట్ల ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధిక సీట్లు సాధించినా కొన్నిచోట్ల ఎక్స్ ఆఫీషియో సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ పలు మున్సిపాలిటీలను సొంతం చేసుకుంది. జనగామ, తొర్రూరు తదితర ప్రాంతాల్లో గందరగోళం వల్ల ఎన్నికను వాయిదా వేశారు. ఇకపోతే అధికార కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్లా ఆధిక్యం ప్రదర్శించింది. హంగ్ ఏర్పడిన చోట్ల పైచేయి సాధించింది. సిఎం రేవంత్ ఆదేశాలతో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. నిజామబాద్ కార్పోరేషన్ను కైవసం చేసుకుంది. మొత్తం ఏడు మున్సిపల్ కార్పొరేషన్లకు సోమవారం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక జరిగింది. మెజార్టీ ఛైర్మన్లు, వైస్ ఛర్మన్లు హస్తగతం అయ్యాయి. ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌లో పాగావేసింది. హంగ్ మున్సిపాలిటీల్లో చక్రం తిప్పిన హస్తం ఫలితాన్ని సాధించింది. ఏడు కార్పోరేషన్లలో ఐదింటిని దక్కించుకున్న కాంగ్రెస్, కొత్తగూడెంలో సిపిఐకి మద్దతు ప్రకటించింది. కరీంనగర్ పీఠంపై జెండా పాతిన బిజెపి నిజామాబాద్‌లో ఖంగు తింది. కరీంనగర్, నిజామాబాద్,రామగుండం, మహబూబ్‌నగర్, నల్లగొండ, మంచిర్యాల, కొత్తగూడెం కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లను ఎన్నుకున్నారు. ఆయా కార్పొరేషన్లలో ఎన్నికైన వారి వివరాలు మిగతా2లో...



## శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

**విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం**

**ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 :** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ మిగతా2లో...

## మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

**ఫలితాలపై బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు విశ్లేషణ**



**హైదరాబాద్,ఫిబ్రవరి 16 :** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు

మిగతా2లో...

## 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా**

**84 కాంగ్రెస్ ,17 బీఆర్ఎస్, 1 బిజెపి**




## పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

● ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు ● రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి ● మధిరలో మీడియాతో డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,ఫిబ్రవరి 16 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలి టీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. మిగతా2లో...

## కరీంనగర్‌పై బిజెపి జెండా

● మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నిక ● డిప్యూటి మేయర్‌గాసునీల్ రావు ఎంపిక ● బిజెపికి లాభించిన బిఆర్ఎస్ తటస్థ వైఖరి




**కరీంనగర్,ఫిబ్రవరి 16 :** తీవ్ర ఉత్కంఠ రేపిన కరీంనగర్ కార్పొరేషన్‌ను భాజపా దక్కించుకుంది. మేయర్ పీఠం దక్కిం చుకు నేందుకు కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. దీంతో కరీంనగర్ పట్టణ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. మేయర్ పీఠాన్ని దక్కించుకో వడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మ కంగా వ్యవహరించారు. కరీంనగర్ కార్పొరేష న్‌లో భాజపా అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచి నప్పటికీ మ్యాజిక్ సంఖ్యను చేరుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా.. అనే విషయంలో సందిగ్ధత కొనసాగింది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో...

## ఇక శరవేగంగా నిజామాబాద్ అభివృద్ధి

- ప్రత్యేక నిధులతో ప్రాధాన్యం ఇస్తామన్న మంత్రి ఉత్తమ్



**నిజామాబాద్,ఫిబ్రవరి 16 :** నిజామాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అందుకోసం నిధులు ప్రత్యేక కేటాయించనున్నట్లు చెప్పారు. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. రహదారులు, అభివృద్ధి విషయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వబోతోందని చెప్పారు. తెలంగాణలో నిజామాబాద్ ఓ గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కృషి

మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# గందరగోళంగా మున్సిపల్ చైర్మన్ల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ),డిప్యూటీ మేయర్: వై.సునీల్ రావు (బీజేపీ) ఎన్నియ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మాతాహిన్ (ఏఐఎంఐఎం) ఎన్నికయ్యారు. ఇక్కడ ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్‌పై పాగా వేశారు. నిజానికి బిజెపి మెజార్టీ సీట్లు సంపాదించిన లాభం లేకుండా పోయింది. రామగుండం కార్పొరేషన్‌లో మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)లు ఎన్నియ్యారు. నల్గొండ కార్పొరేషన్ మేయర్: ముర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్ (ఏఐఎంఐఎం)లు ఎన్నికయ్యారు. మంచిర్యాల కార్పొరేషన్ మేయర్: ధరణి మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్ల రమ్య మహేశ్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్: మూడ్ గణెలిశ్ (సీపీఐ)డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారీ (కాంగ్రెస్) ఎన్నికలయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులుపై సీపీఐ, కాంగ్రెస్ ఒప్పందం చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్గా గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: ఎం సురేందర్ రెడ్డి (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఇకపోతే హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదావేస్తున్న ట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీం పట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనేపేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది. 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపి, బీఆర్‌ఎస్ ల మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది.

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్‌ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30గంటలు కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12.00 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 16 :** దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

# బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

**అమరావతి,ఫిబ్రవరి 16 :** గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

# రైతులకు ప్రభుత్వం తీపి కబురు

**● సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల**

**హైదరాబాద్,ఫిబ్రవరి 16 :** ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ది పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

# కరీంనగర్‌పై బిజెపి జెండా

(మొదటి పేజీ తరువాయి)

రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించారు. మేయర్ పదవి కోసం ఇరువర్గాలు భాజపా, కాంగ్రెస్ మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని భాజపా దక్కించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ మేయర్ అభ్యర్థికి 21 మంది కార్పొరేటర్లు మద్దతు పలికారు. బీఆర్‌ఎస్ తటస్థంగా వ్యవహరించింది. బీఆర్‌ఎస్ ఎటువైపు మొగ్గు చూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది.

ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్‌ఎస్ 9 స్థానాలు, స్వతం త్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించక పోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.

# 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

**హైదరాబాద్,ఫిబ్రవరి 16 :** తెలంగాణ వ్యాప్తంగా 105 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మరో 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ల ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 84 కాంగ్రెస్ కైవసం చేసుకోగా.. 17 బీఆర్‌ఎస్ చేజిక్కించుకుంది. ఒక స్థానంలో భాజపా విజయం సాధించింది. మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. మొత్తం 116 మున్సిపాలిటీలకు ఈ నెల 11న ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఫలితాల సమయానికి 90 స్థానాల్లో వివిధ పార్టీలు స్పష్టమైన మెజార్టీ కనబరచగా.. 36 స్థానాల్లో హంగ్ పరిస్థితి ఏర్పడింది. కాగా, వివిధ పార్టీల మధ్య పొత్తులు, స్వతంత్ర అభ్యర్థులమద్దతుతోకొన్నిమున్సిపాలిటీల్లో చైర్ పర్సన్లు ఎన్నికయ్యారు.

# సిఎం చంద్రబాబుతో తుమ్మల భేటీ



**అమరావతి,ఫిబ్రవరి 16**

: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అమరావతిలో సమావేశం అయ్యారు. ఈభేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా పునర్విభజనలో ఆంధ్రాలో కలిసిన 5 గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడానికి సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. తిరుమలలో తెలంగాణకి 5 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం చంద్రబాబుని తుమ్మల కోరారు. ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించాలని సీఎం చంద్రబాబును మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మం జిల్లా పెద్దవాగు మరమ్మత్తుల కోసం అయ్యే ఖర్చులో 85శాతం నిధులను విడుదల చేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా సత్తుపల్లి, కొవ్వూరు రైల్వేలైన్, పెనుబల్లి, అమరావతి రైల్వేలైన్ నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించారు. భద్రాచలం ముంపు బారిన పడకుండా నిర్మించిన కరకట్టకి సంబంధించి.. ఏపీలో కలిసిన భాగానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మంత్రి తుమ్మల కోరారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ద డమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజ కవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయను న్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఇక శరవేగంగా నిజామాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడం అభివృద్ధికి సంకేతమని అన్నారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 17, ఎంఐఎం 14, బీఆర్‌ఎస్ పార్టీ 1 గెలుచుకున్నాయి. నగర మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎంఐఎంను తమ దారికి తెచ్చుకున్నారు. అలాగే బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఒక అభ్యర్థి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాంతో నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. దాంతో నగర మేయర్‌గా ఉమారాణి పేరును ఖరారు చేశారు. అయితే బీజేపీని ఓడించేందుకు బీఅర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని ఎంపి ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ

# నేటి నుంచి హైటెక్స్ వేదికగా బయో ఏషియా సదస్సు

**● రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు**

**● సదస్సును ప్రారంభించనున్న సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఫిబ్రవరి 16 :** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్-క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16: నియోజకవర్గంలోని మారేడ్ పల్లి మండల పరిధిలోని 8 కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు అయ్యాయి. సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ మొహమ్మద్ అసదుల్లా ఖాన్ తో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఆలస్యం కాకుండా త్వరగా మంజూరు అవుతున్నాయని, పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం ఆడపిల్లల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులకు గురి కావద్దనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చెక్కులను త్వరితగతిన అందజేయాలని అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో చెప్పారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై విరుచుకుపడ్డ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్

**- ఇది ప్రజాపాలన కాదు గూండాల పాలన అంటూ మండిపాటు.**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:- ప్రజాపాలన ముసుగులో రేవంత్ రెడ్డి రౌడీ పాలన చేస్తున్నారు అని మండిపడ్డారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్.ఈ నెల 13న వెలువడిన తెలంగాణ మునిసిపల్ ఎన్నికల ఫలితాల సందర్భంగా బీఎస్పీ నుండి గెలిచిన అభ్యర్థులను కాంగ్రెస్ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి కిడ్నాప్ చెయ్యడాన్ని నిరసిస్తూ,ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దా నిర్వహించిన శాంతియుత ధర్నా లో బీఎస్పీ అభ్యర్థులను కిడ్నాప్ చేసి, రేవంత్ రెడ్డి వర్గం రాజ్యాంగ ఉల్లంగనలకు పాల్పడ్డారు అని దుయ్యబట్టారు. మర్యాదగా మా పార్టీ నుండి గెలిచిన అభ్యర్థులను విడిచిపెట్టకపోతే కారకుల ఇండ్లను ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీఎస్పీ జాతీయ, రాష్ట్ర కోఆర్డినేటర్ లు రాష్ట్ర నాయకులు, అన్ని జిల్లాల, నియోజకవర్గ,మండల,మునిసిపల్ నాయకులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్-చైర్‌పర్సన్ ఎన్నికల రీ-షెడ్యూల్ ఖరారు

**- ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ జి సుధీర్ బాబు..**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:-రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వుల ప్రకారం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మరియు వైస్-చైర్‌పర్సన్ పదవులకు నిర్వహించాల్సిన పరోక్ష ఎన్నికలను 17-02-2026 (మంగళవారం) నాడు నిర్వహించేందుకు రీ-షెడ్యూల్ ఖరారైంది. 16-02-2026 సాయంత్రం 5 గంటల నుండి 17-02-2026 రాత్రి 11 గంటల వరకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం చుట్టూ 500 మీటర్ల పరిధిలో 3 మందికి పైగా గుమికూడరాదు.అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రజలు, రాజకీయ నాయకులు మరియు అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని ఫ్యూచర్ సీటీ కమిషనర్ జీ సుధీర్ బాబు తెలిపారు.

# టి డబ్ల్యూ జె ఎఫ్ జిల్లాల బాధ్యులకు విజ్ఞప్తి.

రాష్ట్రంలో ఆర్ ఎన్ ఐ/పి ఆర్ జి ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని టీవీ చిన్న,మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ కు అక్రెడిటేషన్లు ఇవ్వాలని, ఎంపానల్మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ, రేపు 17వ తేదీ ఉదయం 11గంటలకు హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల టి డబ్ల్యూ జె ఎఫ్ బాధ్యులు, రాష్ట్ర బాధ్యులు హాజరు కావాలని, అదేవిధంగా మీమీ జిల్లాలలోని ఎంపానల్మెంట్ కాని, అక్రెడిటేషన్లు రాని పత్రికల నిర్వహకులు, జర్నలిస్టులు పాల్గొనే విధంగా చూడాలని విజ్ఞప్తి.ఇట్లు,మామిడి సోమయ్య,రాష్ట్ర కన్వీనర్, టి డబ్ల్యూ జె ఎఫ్.

# వాయిదా పడ్డ ఇబ్రహీంపట్నం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:- రేపు కూడా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగేనా.? ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 మంది కౌన్సిలర్లకు గాను 23 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఆకుల యాదగిరి వచ్చాకనే చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని పోడియం వద్ద పలుమార్లు వాగ్వాదానికి దిగారని, గగ్గోలు పెట్టారని ఆర్డిఓ అనంతరెడ్డి అన్నారు.కౌన్సిలర్లు సృష్టించిన గందరగోళం వాళ్ళనే రెండుసార్లు వాయిదా వేసిన ఫలితం లేకపోయిందని అందుకే రేపటికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ఆర్డిఓ అనంతరెడ్డి తెలిపారు... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేను కేవలం ఎక్స్ అఫీషియో మెంబర్గా నా ఓటు వినియోగించుకోవడానికి మాత్రమే మున్సిపల్ ఆఫీస్ కి రావడం జరిగిందని, ఎన్నికల అధికారులు ఎలా చెప్తే అలాగే నడుచుకుంటానని అన్నారు...నూటికి నూరు శాతం బిఆర్ఎస్ పార్టీ పూర్తి ఆదిక్యంతో ఉండి, చైర్మన్ వైస్ చైర్మన్ దక్కించుకుంటుందని జీర్ణించుకోలేక అక్కస్సుతోనే, ముమ్మాటికి అధికార పార్టీ చేస్తున్న వీరంగం ఇది అని, దీనికి పోలీసులు, అధికారులు కొమ్ము కాస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేసిన రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ మొత్తం ఘటనపై పై అధికారులకు,ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేస్తామంటున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు, భారీ ఉత్కంఠ నడుమ మున్సిపల్ కార్యాలయం వెళ్లిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్..

# జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున పండ్లు పంపిణీ

**బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రవీందర్ రెడ్డి.**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:-



మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పవిత్ర ఉపవాసం చేసిన భక్తులకు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరఫున లెక్చరర్స్ కాలనీ డివిజన్, మన్సూరాబాద్ డివిజన్, జి ఎస్ ఐ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఉన్న శివాలయాల వద్ద ఉపవాస విరమణ విధి కొరకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమ నిర్వహణకు మాకు సహకరించిన ఆలయ కమిటీ వారికి, కాలనీ సంక్షేమ సంఘం వారికి, కాలనీ వాసులకు, సోదరులకు, మిత్రులకు, బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులకు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసిన భక్తులకు అందరికీ పేరు పేరున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు..

# భూమి ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి

**- ప్రజా సంఘాల నాయకులు.**

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి నర్సరావు పేట/ ఫిబ్రవరి-16. అన్యాయంగా వ్యవసాయ భూమి ఆక్రమణకు యత్నిస్తూ బాధితులపైనే దాడికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని పిడిఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి సోమవారం డిమాండ్ చేశారు. పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాజుపాలెం మండలం పెద్ద నెమలిపురి గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య, గురువమ్మల కుటుంబానికి గ్రామంలోని సర్వేనెంబర్ 52-20-2సి లో 1-91 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని అదే గ్రామానికి చెందిన తెలికేపల్లి అంకారావు, శివయ్యలు ఆక్రమించుకోవాలని చూస్తూ హక్కుదారులైన శంకరయ్య కుటుంబీకులను గత కొన్నాళ్లుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కాగా తమ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలంటూ పల్నాడు జిల్లా కలెక్టర్ కు శంకరయ్య దంపతులు ఈ నెల 9వ తేదీన వినతి పత్రం అందజేశారు.



జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు రాజుపాలెం మండల సర్వే అధికారులు ఫిబ్రవరి 13న కొలతలు వేసేందుకు వచ్చారు. ఈ క్రమంలో తమ పొలం వద్దకు వచ్చిన శంకరయ్య అతని కుమార్తె వెంకటలక్ష్మిలపై రెవెన్యూ అధికారులు ఎదుటే తెలికేపల్లి అంకారావు, శివయ్యలు దుర్భాషలాడుతూ దాడికి దిగారు. దీంతో భయభ్రాంతులకు గురైన తండ్రి, కుమార్తెలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని పరుగులు తీశారు. ఘటనపై బాధితులు పోలీసులు నాశ్రాయించి ఫిర్యాదు చేశారు. అక్రమంగా భూమిని ఆక్రమించుకోవదానికి యత్నించడమే కాక దాడికి పాల్పడిన తెలికేపల్లి అంకారావు శివయ్యలపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని, భూమికి హద్దులు నిర్ణయించి ఆక్రమణ గురికాకుండా చూడాలని . రెవెన్యూ, పోలీసు అధికారులను పిడిఎం జిల్లా అధ్యక్షుడు షేక్.మస్తాన్ వలి కోరారు.ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు నరసరావుపేట పెద్ద చెరువులో జరిగిన కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వ్8.కోటా నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శీను నాయక్, పిడియం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, తోపాటుజి. రామకృష్ణ ,శ్రీను నాయక్,రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వం విఫలం

**- తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ నియామకం**

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య**

హైదరాబాద్, ఫిబ్రవరి 16: బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య అన్నారు. తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య సోమవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేసి అమలు చేయరా అని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, బీసీ వ్యతిరేఖ దోరణి



విడనాడి.. బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ లకు ఈ సందర్భంగా ప్రవీణ్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆయన అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పల్లె నుంచి పట్నం వరకు బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ మహా శివరాత్రి జాగరణ మహోత్సవ వేడుకలు

**- రహీంపుర ప్లే గ్రౌండ్ లో శివ నామస్మరణలతో వెల్లే విరిసిన ఆధ్యాత్మిక శోభ**



హైదరాబాద్, ఫిబ్రవరి 16: శ్రీ మహాశివ రాత్రి జాగరణ మహోత్సవం ఆదివారం రాత్రి రహీంపురా ప్లే గ్రౌండ్ లో అత్యంత వైభవంగా జరిగింది. గత 15 సంవత్సరాలు గా శ్రీ మహాశివ రాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షులు మాడిశెట్టి



సదానందం గుప్తా ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. మహాశివ రాత్రి సందర్భంగా జాగరణ లో పలు కార్యక్రమాలు భక్తులను పరవశింప జేశాయి. వేదిక పై వివిధ దేవతా మూర్తుల ప్రత్యేక పూజల అనంతరం జై భవాని కీర్తన్ మండల్ ద్వార భజనలు జరిగాయి. ఢిల్లీ కి చెందిన మౌంటీ నటరాజ్ గ్రూప్ వివిధ దేవతా మూర్తుల వేశాధారనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంకు ముఖ్య అతితిగా ఎంఎల్ సి బొగ్గారపు దయానంద్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, పూస్తే శ్రీకాంత్, సామాజిక వేత ఠాగూర్ గోపాల్ సింగ్, బద్రి సింగ్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, శశి కల కృష్ణ, మంగళాట్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్, బాస్ మాజీ అధ్యక్షులు, క్యాతం రాధాకృష్ణ, సేవా సమితి ప్రధాన కార్యదర్శి రాజన్ కుమార్, కోశాధికారి రంజిత్ కుమార్, అదనపు కోశాధికారి రాజేందర్ సింగ్, ఆర్గనైసింగ్ కార్యదర్శి తోట శ్రవణ్ కుమార్, సలహాదారులు, రవీందర్ సింగ్, శ్రీధర్ బాబు, సత్యనా రాయణ, సచిన్ రాజ్ సింగ్, శ్రీధర్ బాబు, సత్యనారాయణ, డి శైలేందర్ సింగ్, గోపాల్ సింగ్, వరప్రసాద్, శ్రీనివాస్, కే నరేష్ గుప్తా, శివ, యాద శ్రీనివాస్ గుప్తా, బ్లరాజ్ గౌడ్, నర్సింలూ గుప్తా, ఐలేన్ గౌడ్, హరీష్, పాండు తదితరులు పాల్గొన్నారు., ఈ సందర్భంగా భక్తులకు, అన్న ప్రసాద వితరణ చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

## అన్నదానం... ఎంతో పుణ్యకార్యం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీరామచంద్రనాయక్





**మహబూబాబాద్,ఫిబ్రవరి16:** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పది మందికి పంచి పెట్టడమే మహాదానమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే శ్రీరామచంద్ర నాయక్ అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పండుగ సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవిలో శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో పుణ్యమైందని అన్నారు. ఓ సంస్థను స్థాపించి... గత 10 సంవత్సరాలుగా విజయవంతంగా అన్నదానం నిర్వహించడం ఆషామాషీ కాదన్నారు., ఎంతో సేవా తత్పరరత ఉన్నవారికే అది సాధ్యం అవుతుందన్నారు. కురవి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు చరిత్రలో ఓ మైలురాయి అని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత దానధర్మాలకు కేటాయించాలని సూచించారు. అన్నింటికంటే దైవ కార్యంలో నిమగ్నులవ్వడం కొందరికే వీలవుతుందని, అ కొందరిలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు అందిస్తున్న సేవ ఆదర్శప్రాయమన్నారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన, హాజరైన ప్రముఖులను ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ తాము కేవలం నిమిత్త మాత్రులమేనని, అంతా దైవానుగ్రహమేనని తెలిపారు. బంధుమిత్రుల, దాతల సహకారం తమలో సేవాభావాన్ని పెంచిందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె. రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎస్.సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ మేకల దామోదర్ రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు కాసుల మల్లికార్జున్, డి. జనార్ధన్ రెడ్డి, శ్రీ వీరభద్రసేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్, కాసుల శ్వేత, శకుంతల, నర్రా దేవేందర్, విజయ్ భారతి, కొండూరు వినోద్ కుమార్, సంజన, విశ్వనాధం, విజయ, సంధ్య, శ్యామ్, అండాలు, రాణి, కాసుల రమణ, స్రవంతి, కాసుల మల్లికార్జున్, స్వాతి, కాసుల చంద్రుడు, లక్ష్మీ, మౌనిక, నర్రా సాయి, కిషోర్, శివాని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభోత్సవం కానున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు



**(హైదరాబాదు ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:-**తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ప్రారంభించనున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరగబోయే బయోఏషియా–2026 సదస్సు ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈ ప్రపంచ స్థాయి సదస్సు ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ – ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్నారు. టెక్‌బయో ఇన్నోవేషన్స్‌లో దేశం గ్లోబల్ హబ్‌గా మారుతున్న తరుణంలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణ సంబంధించిన అంశాలపై ఈ సదస్సు చర్చించనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం బయోఏషియా సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తలు, బయో సైన్సెస్ రంగంలో నిష్ణాతులు ఆయా అంశాలపై ప్రసంగించనున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ గారు, అమెరికాకు చెందిన ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ కీలకోపన్యాసం చేయనున్నారు. సైన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ సప్లయ్, నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్, ఫార్మా, బయోటెక్ భవిష్యత్తు, ఏఐ, ఆర్ అండ్ డీ (డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్), గ్లోబల్ ఇంపాక్ట్, తెలంగాణ రైజింగ్ 2047--వరల్డ్–క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ వంటి కీలక అంశాలపై జరిగే చర్చల్లో వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు పాల్గొంటారు.

## రణరంగంల మారిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక



రేపు కూడా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరిగేనా.? ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 మంది కౌన్సిలర్లకు గాను 23 మంది ప్రమాణస్వీకారం చేశారు. ఆకుల యాదగిరి వచ్చాకనే చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని పోడియం వద్ద పలుమార్లు వాగ్వాదానికి దిగారని, గగ్గోలు పెట్టారని ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు.కౌన్సిలర్లు సృష్టించిన గందరగోళం వాళ్ళనే రెండుసార్లు వాయిదా వేసిన ఫలితం లేకపోయిందని అందుకే రేపటికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నేను కేవలం ఎక్స్ అఫీషియో మెంబర్గా నా ఓటు వినియోగించుకోవడానికి మాత్రమే మున్సిపల్ ఆఫీస్ కి రావడం జరిగిందని, ఎన్నికల అధికారులు ఎలా చెప్తే అలాగే నడుచుకుంటానని అన్నారు...నూటికి నూరు శాతం బిఆర్ఎస్ పార్టీ పూర్తి ఆదిక్యంతో ఉండి, చైర్మన్ వైస్ చైర్మన్ దక్కించుకుంటుందని జీర్ణించుకోలేక అక్కస్సుతోనే, ముమ్మాటికి అధికార పార్టీ చేస్తున్న వీరంగం ఇది అని, దీనికి పోలీసులు, అధికారులు కొమ్ము కాస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేసిన రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ మొత్తం ఘటనపై పై అధికారులకు,ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేస్తామంటున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు, భారీ ఉత్కంఠ నడుమ మున్సిపల్ కార్యాలయం నుండి వెళ్లిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్..

## బీజేపీకే దక్కిన కరీంనగర్ మేయర్ పీఠం



**కరీంనగర్** మేయర్ పీఠం ఏ పార్టీకి దక్కనుందనే ఉత్కంఠకు తెర పడింది. కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని కమలదళం దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా అదే పార్టీకి చెందిన సునీల్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది.అధికార దుర్వినియోగం చేశారు : కరీంనగర్ గడ్డ మీద ప్రజాస్వామ్యం నిలబడిందని బండి సంజయ్ అన్నారు. మేయర్?గా ఎన్నికైన కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్?గా ఎన్నికైన సునీల్ రావుకు ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల సహకారంతో ఇది సాధ్యం అయిందని తెలిపారు. పక్క పార్టీలతో జరిగిన కబడ్డీ కప్?లో బీజేపీ గెలిచిందన్నారు. కాంగ్రెస్ నేతలు అనేక కుట్రలకు పాల్పడ్డారని, అవన్నీ బయటికి చెప్పలేమని పేర్కొన్నారు. కరీంనగర్ బల్దియాపై కాషాయ జెండా ఎగురవేయాలన్న కల నెలవేరిందని గుర్తు చేశారు.

కరీంనగర్?లో మూడు పార్టీలు కలిశాయి : ప్రభుత్వం ఏర్పడాలన్న పోవాలన్నా కరీంనగర్ నుంచే, అందుకే బీజేపీని అడ్డుకునేందుకు అనేక కుట్రలు పన్నారని విమర్శించారు. కార్పొరేటర్లు అందరూ వెళ్లి కేంద్ర మంత్రి, సీఎంను కలిసి నిధుల కోసం అడుగుతామని, మేయర్?గా బీజేపీ నేత కాకుండా అనేక ప్రచారాలు చేశారని, వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, అమ్మవారిని నమ్ముకొన్నామని అన్నారు. ప్రజల మద్దతు ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు కుట్రలు చేశారో అర్థం కాలేదని, మేజిక్ ఫిగర్ లేకున్నా ఎందుకు కుట్రలు పన్నారో తెలియదని, చీకటి ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆట ప్రారంభిస్తే ఇప్పుడు తాము ముగించామని, కరీంనగర్?లో మూడు పార్టీలు కలిసి మమల్ని అడ్డుకున్నారని ఆరోపించారు. మీరంతా ఒక్కటే అని రుజువయిందని అన్నారు.కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాసకరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివా"ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తర్వాత రాజకీయాలు పక్కనపెట్టాలి. కరీంనగర్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల బరిలోకి దిగాం. కరీంనగర్ అభివృద్ధికి కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులనూ కలుస్తాం. బీజేపీ మేయర్ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా వదిలేది లేదు. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలన్నీ కలిసి సాధించింది ఏంటి?. ఎన్నికల్లో మేం గెలిచినా మేయర్‌గా ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కుట్రలు చేశాయి."– బండి సంజయ్, కేంద్రమంత్రిప్రమాణ స్వీకారం : అంతకు మందు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్యేక అధికారి ఆర్డీవో మహేష్ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. ఈ కార్యక్రమానికి బండి సంజయ్, మానకొండూరు ఎమ్మెల్యే, ఎక్స్ అఫిషియో సభ్యుడు సత్యనారాయణ హాజరైయ్యారు.కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్?తో బండి సంజయ్

కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్?తో బండి సంజయ్ ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు : 66 స్థానాలున్న కరీంనగర్ కార్పొరేషన్‌లో జీజేపీ అత్యధికంగా 30 స్థానాల్లో గెలిచినప్పటికీ బల నిరూపణ చేసుకొని పీఠాన్ని కైవసం చేసుకుంటుందా? అనే ఉత్కంఠ నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని బండి సంజయ్ రెండ్రోజుల క్రితం ధీమా వ్యక్తం చేసినా ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలు ఆసక్తిని రేపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) సభ్యులు, స్వతంత్రులు కలిసి ఎలాగైనా కార్పొరేషన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవాలనే విధంగా చక్రం తిప్పారని సమాచారం. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగర శివారులోని ఓ రిసార్టులో వేర్వేరుగా క్యాంపులు నిర్వహించినట్లు తెలుస్తోంది. మేయర్ పదవి కోసం ఇరువర్గాల (కాంగ్రెస్, బీజేపీ) మధ్య సంఖ్యాపరంగా దోబూచులాట కొనసాగింది. చివరికి మేయర్ పీఠాన్ని బీజేపీనే దక్కించుకుంది.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా, మహా పాదయాత్ర




**(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) ఫిబ్రవరి16:**

గురువారం 19 -02-2026 ఉదయం 9:00 గంటలకు బి. యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డి నగర్ చౌరస్తా నుండి చత్రపతి శివాజీ విగ్రహం శ్రీపురం కాలనీ వరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 వ జయంతి సందర్భంగా నిర్వహించ బోయే మహా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహించిన సమీక్ష సమావేశంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ ఈ గురువారం 19 ఫిబ్రవరి 2026 రోజున జరగబోయే శివాజీ మహారాజ్ 396 వ జయంతి వేడుకలను హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. అనంతరం శ్రీపురం కాలనీలోని శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శుద్ధి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘు రాం నేత, భూపాల్ రెడ్డి, శంకరయ్య గౌడ్, ప్రదీప్ రెడ్డి,శ్రీధర్ రావు, ప్రేమ్ నాథ్, జైపాల్ రెడ్డి, రవిశంకర్, వెంకట్ రెడ్డి, మహే ందర్ రెడ్డి, శంకరన్న,వెంకట్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధీర్, సురేష్ కుమార్, సంజీవ మరియు కాలనీ సభ్యులు రజిని, మహేందర్ రెడ్డి, విటల్ రెడ్డి, సికిందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రయ్య, రాజేందర్ రెడ్డి, ఉన్నారు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి జనగణన సమన్వయ కమిటీ సమావేశం



**హైదరాబాద్:** సచివాలయంలో ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి జనగణన సమన్వయ కమిటీ (రాజజజ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2027 జనగణనకు రాష్ట్రంలో సమగ్ర ఏర్పాట్లు ప్రారంభించడానికి చర్చలు జరిగాయి. రాష్ట్రంలో జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడం ఈసారి ప్రత్యేకత అని అధికారులు పేర్కొన్నారు. జిల్లాల స్థాయి సన్నద్ధత కోసం త్వరలో కలెక్టర్ల సమావేశాలు నిర్వహించనున్నారు. శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమని ప్రధాన కార్యదర్శి సూచించారు.అవసరమైన ఉద్యోగుల సంఖ్యపై అంచనా సిద్ధం చేయాలని, డిజిటల్ సర్వేలో స్లమ్ ప్రాంతాలు, దూర ప్రాంతాలు మిస్ కాకుండా పూర్తి కవరేజ్‌ని కల్పించాలని అధికారులు ఆదేశించారు. సిబ్బందికి నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. మొదటి దశలో సుమారు 90,000 ప్రభుత్వ ఉద్యోగులను ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించనున్నారు. సమావేశంలో పలువురు ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ ఎందుకు కాపాడుతున్నారో అర్థమైంది

**నిజామాబాద్, ఫిబ్రవరి 16:** నిజామాబాద్ నగర మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకోవడంతో స్థానిక ఎంపీ, బీజేపీ సీనియర్ నేత ధర్మపురి అర్వింద్ సోమవారం స్పందించారు. మూడు ఓట్ల తేడాతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ గెల్చుకుందన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఒకటయ్యాయని మండిపడ్డారు కాళేశ్వరం, ఈ కార్ రేసింగ్ తదితర కేసుల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లను సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారో ఈ రోజు అర్థమైందమన్నారు. ఇందూరులో బీజేపీని ఓడించడానికి అనైతిక పొత్తుకు శ్రీకారం చుట్టారంటూ వారిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓటమిలో కాంగ్రెస్ రంగు పూసుకుని తిరిగే పోలీసుల హస్తం కూడా ఉందని ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ ఐదేళ్ల పదవి పూర్తయ్యే లోపు ఈ ఫలితాన్ని రివర్స్ చేసి చూపిస్తామని ఆయన శపథం చేశారు. అయితే ఈ మున్సిపల్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ప్రకటించారు. ఈ టర్మ్ అయ్యేలోపు కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. అసలు ఏం జరిగిందంటే..? ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నిజామా బాద్ నగర పాలక సంస్థలో బీజేపీ 28 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ 17, ఎంఐఎం 14, బీఆర్ఎస్ పార్టీ 1 గెలుచుకున్నాయి. నగర మేయర్ పీఠం దక్కాలంటే.. మ్యాజిక్ ఫిగర్ 31 రావాల్సి ఉంటుంది. అంటే.. మ్యాజిక్ ఫిగర్‌కు మూడు అడుగుల దూరంలో బీజేపీ నిలిచిపోయింది. అలాంటి వేళ అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఎంఐఎంను తమ దారికి తెచ్చుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఒక అభ్యర్థి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాంతో నిజామాబాద్ మేయర్ పీఠం కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడింది. దాంతో నగర మేయర్‌గా ఉమారాణి పేరును ఖరారు చేశారు.



# చైర్మన్ ఎన్నిక వేళ ఇస్నాపూర్‌లో బిగ్ ట్విస్ట్

**సంగారెడ్డి, ఫిబ్రవరి16:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బిగ్ ట్విస్ట్‌లు జరుగుతున్నాయి. ఈస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికలో ఓటు హక్కు వినియోగం కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒకే కారులో కలిసి రావడం చర్చనీయాంశంగా మారింది. అలాగే బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 1వ వార్డు కౌన్సిలర్ మమత.. కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి 8వ వార్డు కౌన్సిలర్‌గా మాధవి నరేందర్ రెడ్డి గెలిచారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ గూటికి చేరారు. స్వతంత్రులుగా గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు తాజాగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన కౌన్సిలర్ ఒకరు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇస్నాపూర్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఓట్లు 14, కాంగ్రెస్ ఓట్లు 12కు చేరాయి.అమరచింత.. అమనగల్..వనపర్తి జిల్లా అమరచింతలో ఉత్కంఠ నెలకొంది. ఈ మున్సిపాలిటీలో బీఆర్ఎస్, బీజేపీ వార్డు కౌన్సిలర్లు ఒక్కటయ్యారు. ఇక అమన్‌గల్‌లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన పత్యానాయక్.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో చైర్మన్‌గా పత్యానాయక్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఎంఐఎంకు చెక్ పెట్టేందుకు..బైంసాలో ఎంఐఎ ంకు చెక్ పెట్టేందుకు అన్ని పార్టీలు ఒకే తాటిపైకి వచ్చాయి. చైర్మన్ పదవి కోసం ఎంఐఎం పోటీ పడుతోంది. దాంతో ఎంఐఎ ంకు వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటయ్యాయి.ఎర్రబెల్లి భార్య హల్‌చల్. .మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూర్ మున్సిపాలిటీ ఎదుట ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గీయులు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఎర్రబెల్లి దయాకర్ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ వర్గీయులు నినాదాలు. ప్రతిగా ఎంపీ కడియం కావ్య ఓటు వేయడానికి వీల్లేదంటూ బీఆర్ఎస్ వర్గీయులు నిరసన చేపట్టారు. ఆ క్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ భార్య ఉషా హల్‌చల్ చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో స్థానికంగా 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు.ఆదిలాబాద్‌లో వింత పరిస్థితి..ఆదిలబాద్ మున్సిపాలిటీ బీజేపీకి దక్కకుండా అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తులు మీద ఎత్తులు వేస్తోంది. దాంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులు ఒక తాటిపైకి వచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గెలిచిన స్వతంత్ర అభ్యర్థి అనూష పేరును కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. ఎంఐఎంకు వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన వారికి కో- ఆప్షన్ పదవులు ఇవ్వాలంటూ ఈ పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది.వింత పరిస్థితి..ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎన్నికల్లో గెలిచిన పలువురు కౌన్సిలర్లు కనిపించడం లేదని వారి వారి కుటుంబసభ్యుల సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం భారీ నిరసన చేపట్టారుఅత్తాకోడళ్ల సవాల్.నారాయణపేట మున్సిపల్ కార్యాలయానికి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఓటు వేసేందుకు వచ్చారు. బీజేపీకి మద్దతుగా ఓటు వేయడానికి ఎంపీ డీకే అరుణ వచ్చారు. అయితే నారాయణపేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారు. దాంతో ఈ పీఠం ఏ పార్టీ ఖాతాలో పడుతుందనేది సస్పెన్స్‌గా మారింది.



# జగిత్యాలలో వీడిన చిక్కుముడి కామారెడ్డిలో బిగ్ ట్విస్ట్

**జగిత్యాల, ఫిబ్రవరి 16:** తాజా.. మాజీ ఎమ్మెల్యేల మధ్య అధిపత్య పోరు నెలకొన్న వేళ.. జగిత్యాల మున్సిపాలిటీ పీఠంపై సస్పెన్స్ వీడింది. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ వర్గానికే పార్టీ అధిష్ఠానం కేటాయించింది. దాంతో మున్సిపల్ చైర్మన్‌గా ఆయన వర్గానికి చెందిన సమిండ్ల వాణిని ఎంపిక చేశారు. అలాగే వైస్ చైర్మన్ పదవి మాజీమంత్రి జీవన్ రెడ్డి వర్గానికి కేటాయించింది. దీంతో వైస్ చైర్మన్ పదవికి పర్వీన్‌ను ఎన్నుకున్నారు.మరోవైపు జెడ్పీ, మార్కెట్ కమిటీ పదవును జీవన్‌రెడ్డి వర్గానికి కేటాయిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తాము సైతం కష్ట పడ్డామంటూ జీవన్‌రెడ్డితోపాటు ఆయన వర్గం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ మేరకు జీవన్ రెడ్డి వర్గానికి వైస్ చైర్మన్ పదవిని కేటాయించారు. దీంతో ఇరువర్గాలు ప్రస్తుతానికి శాంతించినట్లు ఒక చర్చ సాగుతోంది.కామారెడ్డిలో బిగ్ ట్విస్ట్..కామారెడ్డి మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికల్లో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచిన ఇప్ప ఉమారాణిని చైర్ పర్సన్ పీఠం వరించింది. ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్ప ఉమారాణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేది లేదంటూ కామారెడ్డిలోని బీఆర్ఎస్ పార్టీ నేతలు తేల్చి చెప్పారు.దాతో తాజాగా పార్టీలో చేరిన ఇప్ప ఉమారాణి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించింది. మరోవైపు వైస్ చైర్మన్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ నేతలు కోరారు. హాఫీజ్, కాసర్ల గోదావరిలో ఒకరికి ఈ వైస్ చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది.




# రాష్ట్రంలో అరాచక పాలన : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

**సూర్యాపేట, ఫిబ్రవరి 16 :** రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విచిత్రమైన పాలన నడుస్తోందని, అడుగడుగునా అరాచకాలు, దాడులు జరుగుతున్నాయన్నారు. బీజేపీ పార్టీ కేసీఆర్ ను చూసి భయపడుతుందని, అందుకే రేవంత్ రెడ్డితో చేతులు కలిపిందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్‌పై కాళేశ్వరం, ఈ కార్ రేస్ విషయంలో పెట్టిన కేసులన్నీ పనికిమాలిన కేసులేన్నారు. ఇక రాష్ట్రంలో ఎన్నికల సంఘం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నదని, ఎన్నికల సంఘం కాంగ్రెస్‌కు బీ టీమ్‌లా వ్యవహరిస్తోందని ఆరోపించారు.మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైనా నేడు సైతం చాలా చోట్ల బీఆర్ఎస్ కౌన్సిలర్లపై దాడులు, కిడ్నాప్‌లు జరిగాయన్నారు. కాంగ్రెస్ బీజేపీ తోడు దొంగలు. ఈ రెండు పార్టీలు చేతులు కలిపాయి. ఈ మున్సిపాలిటీ ఎన్నికల్లో చాలాచోట్ల పొత్తులు పెట్టుకున్నయ్. బీజేపీ, కాంగ్రెస్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నయని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నా, ఎన్ని దాడులు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా తమ కార్యకర్తలు వీరోచితంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే అన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీవేనని, రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. అది ఇప్పటికే ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగురవేశాం, సగానికి పైగా పంచాయతీలను గెల్చుకున్నట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగిరిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తిరుమలగిరి మున్సిపాలిటీలో రూ.33 కోట్లు అభివృద్ధి నిధులు సాంక్షన్ చేపిస్తే వాటిని అన్నింటినీ ఆపి వేశారన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే సామేల్ తో నియోజకవర్గంలో దందాలు, దోపిడీలు, దాడులు ఎక్కువ అయినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడు ఎలాంటి దౌర్జన్యాన్ని చూడలేదన్నారు. దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అయినా తామెవరికీ భయపడమని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ పోరాటం చేసినోళ్లం, ఈ కాంగ్రెస్ దొంగలకు భయపడే ప్రసక్తే లేదని, వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తిలో గెలిచి చూపిస్తామని, తెలంగాణకు కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు.




# సన్న వడ్లకు బోనస్ బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల - మీ ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదో చెక్ చేసుకోండి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. గత ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ వరి సన్న రకాల బోనస్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో సన్న రకాల వరి పంట సాగు చేసిన అన్నదాతలకు క్వింటాల్ ధరపై 500 రూపాయల బోనస్ కోసం 514.36 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక కేటాయింపులు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కీలకమైన పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా 2025-26 ఖరీఫ్ సీజన్?లో సన్న రకాల వరి పంట సాగు చేసిన 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.పంటల సాగును ప్రోత్సహించేందుకు : ఈ నిధుల విడుదలతో పాటు పౌరసరఫరాల సంస్థ వరి బోనస్ కోసం ఇప్పటికే 1939.58 కోట్ల రూపాయలు ప్రాసెస్ చేసి అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అనూహ్య వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, కీలక వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చే క్రమంలో పంట సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వరి ఒక క్వింటా ధరపై 500 రూపాయలు అదనపు బోనస్ ఇస్తుండటంతో సన్న రకాల సాగు గణనీయంగా పెరుగుతోంది .కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఏ" గ్రేడు ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర 2,389 రూపాయలు కంటే బోనస్ 500 రూపాయలు అదనం. ఈ పెండింగ్ బకాయిలు చెల్లించడం వల్ల రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుల కృషికి తగిన ప్రతిఫలం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం అంకితభావం మరింత బలపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.



# ఎన్నిక వాయిదా వేయడం దుర్మార్గం : ఎర్రబెల్లి దయాకర్ రావు



**మహబూబాబాద్ జిల్లా:** తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన విమర్శించారు..ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యి, పరిస్థితులు సజావుగా ఉన్నప్పటికీ ఎన్నికను వాయిదా వేయడం దుర్మార్గమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను సంప్రదించేందుకు ఫోన్ చేసినా స్పందించలేదని ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. తొర్రూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా నేపథ్యంలో జిల్లా రాజకీయాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఈ మున్సిపాలిటీలో దంపతులదే ఆధిపత్యం



**నిర్మల్:** నిర్మల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు భార్యాభర్తలకే దక్కడం విశేషంగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అప్పాల కావ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా ఆమె భర్త అప్పాల గణేష్ చక్రవర్తి కూడా కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో నిర్మల్ మున్సిపాలిటీలో కొత్త నాయకత్వంపై ఆసక్తి నెలకొంది.అశ్వారావుపేట మున్సిపాలిటీలో..ఇదిలా ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. చైర్‌పర్సన్‌గా శశికళ ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా ఆమె భర్త రమేష్ ఎన్నికయ్యారు. భార్యాభర్తలే మున్సిపల్ పీఠాలను అధిష్టించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.


# బీఆర్ఎస్ తటస్థం బీజేపీదే కరీంనగర్ మేయర్ పీఠం

**కరీంనగర్, ఫిబ్రవరి 16:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, సునీల్‌రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ ఎటువైపు మొగ్గుచూపకుండా తటస్థంగా ఉండటంతో, బీజేపీ అభ్యర్థి 34 ఓట్లతో విజయం సాధించారు. దీంతో మొదటి సారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది.కాగా.. ఇటీవలి మున్సిప ల్ ఎన్నికల ఫలితాల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 66 డివిజన్లు ఉండగా.. బీజేపీ 30 స్థానాలు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 స్థానాలు, బీఆర్ఎస్ 9 స్థానాలు, స్వతంత్రులు 8 స్థానాలు, ఎంఐఎం 3 సీట్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రెండు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఫలితాలతో హంగ్ నెలకొన్నప్పటికీ.. స్వంతంత్రులు, ఇతరుల అభ్యర్థులతో బీజేపీ మేయర్ పదవిని దక్కించుకుంది.




# తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వాయిదా బీఆర్ఎస్ శ్రేణుల నిరసన..!

**తొర్రూరు :** తొర్రూరులో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదాపడింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. బీఆర్ఎస్ అవసరమైన మెజారిటీ ఉన్నా ఛైర్మన్ ఎన్నికను ఎందుకు వాయిదా వేశారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడటంతో బీఆర్ఎస్ కౌన్సిలర్‌నలు ప్రత్యేక క్యాంప్‌కు తరలించారు. రేపు తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంది.తొర్రూరు మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులకుగానూ బీఆర్ఎస్ పార్టీ 9 వార్డులనూ, కాంగ్రెస్ పార్టీ 7 వార్డులను గెలుచుకుంది. వాస్తవానికి ఎవరికి 9 వార్డులు ఉంటే వారికే ఛైర్మన్ పదవి దక్కాలి. ఆ ప్రకారం బీఆర్ఎస్ పార్టీదే ఛైర్మన్ పీఠం. కానీ కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యులుగా పేర్లు నమోదు చేసుకోవడంతో కాంగ్రెస్ బలం కూడా 9కి పెరిగింది. దాంతో డ్రా ద్వారా ఛైర్మన్‌ను, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకునే పరిస్థితి ఏర్పడింది.అయితే.. కడియం కావ్య గతంలో వరంగల్ కార్పోరేషన్‌లో కూడా ఎక్స్ అఫిషియో మెంబర్ తన పేరును నమోదు చేసుకున్నారు. ఇప్పుడు తొర్రూరులో కూడా ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పేరు నమోదు చేసుకోవడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. వరంగల్ కార్పొరేషన్‌లో ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఉన్న ఆమె ఇప్పటికిప్పుడు తొర్రూరులో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా పేరును ఎలా నమోదు చేసుకుంటారని ప్రశ్నిస్తున్నారు.దీనిపై బీఆర్ఎస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. అయితే కడియం కావ్యకు తొర్రూరులో ఓటు హక్కు ఉండదని, అప్పుడు బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నట్టేనని, అలాంటప్పుడు ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేయాల్సిన అవసరం ఏమొచ్చిందని బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నాయి.



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక




Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR R R DIST., TELANGANA, Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 .ROAD NO 2. MADHRA NAGAR. MANSURABAD .LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876